ప్రజాశక్తి
గురువారం 16 మే 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

పార్లమెంట్ ఓటింగ్‌లో... విశాఖే అత్యల్పం

అత్యధికంగా ఒంగోలులో 87

అత్యల్పంగా వైజాగ్ 71

భీమిలిలో అత్యధికంగా 75.96 శాతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని 25 పార్లమెంట్ స్థానాలకు గానూ ఈ నెల 13న పోలైన ఓట్ల శాతంలో విశాఖ ఎంపీ స్థానానికి అత్యల్పంగా 71శాతం నమోదైంది. అత్యధికంగా ఒంగోలు ఎంపీ స్థానం 87 శాతం నమోదు చేసుకుని నెంబర్ 1 స్థానం కైవసం చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా విజయనగరం పార్లమెంట్ స్థానానికి సైతం 81.05 శాతం బాగానే నమోదైంది. విశాఖ జిల్లా మొత్తం ఓటింగ్ 85.45 శాతానికి ఎగబాకడం విశేషం. గాజువాకలో 69.83శాతం మాత్రమే నమోదైంది. టిడిపి, వైసిపి అభ్యర్థుల ఆశలన్నీ ఈ సెగ్మెంట్లపైనే అధికంగా ఉన్నాయి. గతంలో విశాఖ పార్లమెంట్ సభ్యులుగా 2019లో ఎంవివి సత్యనారాయణ గెలుపునకు గాజువాక సెగ్మెంట్‌లో ఓటింగ్ కాస్త అధికంగా పడినందున గెలుపొందారు. ఈ సారి వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఎస్‌కోట, గాజువాక, భీమిలిపైనే అత్యధికంగా ఓటింగ్ కోసం ఎదురుచూస్తుండగా ఎస్‌కోట ఓటింగ్ టిడిపికి క్రాస్ జరిగిందన్న చర్చ సాగుతోంది. అంతేగాక ఇండియా ఫోరం తరపున కాంగ్రెస్ అభ్యర్థి బి.సత్యారెడ్డి పార్లమెంట్‌కు బరిలో ఉండడంతో ఈయన ఎవరి ఓట్లు చీల్చుతారన్న ఆందోళన ఇరు ప్రధాన పార్టీల్లో నెలకొంది.

అసెంబ్లీ ఓటింగ్ 2019 కంటే 3.78శాతం అదనం...

ఈ నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల ఓటింగ్ శాతం పెరుగుదల, తగ్గుదల విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం (బిజెపి, జనసేన కూటమి) వైసిపి లెక్కలు వేసుకోవడంలో పూర్తిగా తలమునకలయ్యాయి. విశాఖ జిల్లాలోని 1991 పోలింగ్ కేంద్రాలలో 14,09,116 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికలు 2019తో పోల్చితే ప్రస్తుతం 2024లో పోలింగ్ శాతం 3.78శాతం పెరిగింది. 2019 ఎన్నికలలో మొత్తం ఓట్లు 18,81,678 ఉన్నాయి. అందులో అప్పట్లో పోలయిన ఓట్లు 12,46,529. అంటే ఓట్ల శాతం 66.25. 2024 ఎన్నికల్లో మొత్తం ఓట్లు 20,12,373 కాగా అందులో పోలైన ఓట్లు 14,09,116 ఓట్లు. అంటే పోలింగ్ శాతం 70.03శాతంగా

మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రలను వ్యతిరేకించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం, అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు చేస్తున్న కుట్రలను ప్రజలు వ్యతిరేకించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం వైఫల్యం వల్ల 25 రోజుల నుంచి పోర్టు స్తంభించిందని, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యం జాప్యం చేస్తోందని విమర్శించారు. గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు బేసిక్ కేవలం రూ.3400 మాత్రమే ఇస్తున్నారని, నైపుణ్యం గల పోర్టు ఆపరేషన్, మెకానిక్, ఎలక్ట్రీషియన్స్‌కు కూడా నెలకు రూ.17000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. బోనస్ చట్టప్రకారం చెల్లించడం లేదన్నారు. గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఈ నెల 3న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా అదానీ పోర్టు యాజమాన్యం అమలు చేయలేదన్నారు. గంగవరం పోర్టు కార్మికులు ఏప్రిల్ 30వ తేదీ నుంచి డ్యూటీలో చేరడానికి సిద్ధపడినా యాజమాన్యం చేర్చుకోలేదని తెలిపారు. అయినా కేంద్ర ప్రభుత్వం అదానీ పోర్టుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గంగవరం పోర్టుకు మధ్య గోడమాత్రమే ఉందని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 2.5 లక్షల టన్నుల కోకింగ్ కోల్‌ను స్టీల్‌ప్లాంట్‌కు పంపకుండా గంగవరం పోర్టులోనే నిలిపివేసిందని తెలిపారు. కోక్‌ఓవెన్ డిపార్టుమెంట్‌లో రోజుకు 400 హీట్లు జరగాల్సిన ఉత్పత్తి కోకింగ్ కోల్ సరఫరా కానందున వంద హీట్లకు పడిపోయిందన్నారు. కోక్‌ఓవెన్ బ్యాటరీలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూరుశాతం విశాఖ స్టీల్ వాటాను అమ్మాలన్న నిర్ణయం కార్మికుల పోరాటంతో ఆగిపోయిందని తెలిపారు. దొడ్డిదారిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అమ్మడానికి ఈ కుట్ర సాగుతోందన్నారు. గంగవరం పోర్టును విశాఖ స్టీల్‌ప్లాంట్‌కోసం నిర్మించారని, దాన్ని ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించడం వల్ల నేడు విశాఖ స్టీల్ కష్టాల్లోకి నెట్టబడిందని వివరించారు. గంగవరం పోర్టును విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు స్వాధీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్‌ను వెంటనే సరఫరా చేయాలని ఈ నెల 3వ తేదీన ఎపి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినా గంగవరం పోర్టు యాజమాన్యం నేటికీ అమలు చేయలేదని చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమారమంగళం పాల్గొన్నారు.

దబోల్కర్ హత్య కేసులో సూత్రధారులను శిక్షించాలి

వార్త 2లో..

సివిల్ సర్వీసు ర్యాంకర్ నరేంద్రపడాల్‌కు సన్మానం

వార్త 2లో..

గురుకుల కాలేజీల్లో మిగులు సీట్ల భర్తీకి నేడు, రేపు కౌన్సెలింగ్

వార్త 4లో..

19న జూలో జీవ వైవిధ్యంపై పోటీలు

వార్త 4లో..

భువనేశ్వర్-యలహంక మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ



వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్-యలహంక మధ్య వేసవి పత్యేక రైళ్లు నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 02811 భువనేశ్వర్-యలహంక ప్రత్యేక రైలు జూన్ 1 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 19.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 01.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 01.53 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 23.55 గంటలకు యలహంక చేరుకుంటుంది. 02812 యలహంక-భువనేశ్వర్ ప్రత్యేక రైలు జూన్ 3 నుంచి జులై 1వ తేదీ వరకు ప్రతి సోమవారమూ ఉదయం 05.00 గంటలకు యలహంకలో బయలుదేరి, మరుసటి రోజు 04.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 04.32 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు ఖుర్దా రోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, నంద్యాల, డోన్, ధర్మవరం, భువనగిరి సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా ప్రయాణిస్తాయి.

నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్

జగదాంబ జంక్షన్‌కు

ఆకర్షణగా క్లాక్ టవర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరం నడిబొడ్డులో భారీ వ్యయంతో జగదాంబ జంక్షన్‌లో నిర్వహిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.2.80 కోట్ల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నారు. 2023 నవంబర్‌లో దీని నిర్మాణానికి జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శంకుస్థాపన చేశారు. అప్పట్నుంచి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 60 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్న క్లాక్ టవర్ ఎంతో విశిష్టమైనది. నిర్మాణంలో భాగంగా క్లాక్ టవర్‌తో పాటు అందమైన ల్యాండ్ స్కేపింగ్‌తో కూడిన ఫౌంటెన్ ఏర్పాటు చేయనున్నారు. ఎల్లమ్మ తోటగా పిలవబడే ఈ ప్రాంతంలో 1970లో 70 ఎంఎం స్క్రీన్‌తో అత్యంత ఆధునికమైన జగదాంబ థియేటర్‌ను నిర్మించారు. అప్పటినుంచి ఈ ప్రాంతాన్ని జగదాంబ జంక్షన్‌గా ప్రజలు పిలుస్తున్నారు. క్లాక్ టవర్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం పేరును క్లాక్ టవర్ జంక్షన్, లేదా విజయనగరం లోని గంటస్తంభం జంక్షన్‌ను పిలిచినట్లుగానే, విశాఖలో గంటస్తంభం జంక్షన్ అని పిలిచినా ఆశ్చర్యపోనవసరం లేదు.

క్లాక్ టవర్ నిర్మాణం స్వరూపం పూర్తయింది. నాలుగు వైపులా అందమైన టైల్స్ అమర్చే పనులు జరుగుతున్నాయి. జివిఎంసి ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో నగర పరిధిలో 20 జంక్షన్లు, 16 రోడ్ల సుందరీకరణ పనులను చేపట్టారు. ఈసరికే అనేక పనులు పూర్తయ్యాయి కూడా. అందులో భాగంగానే జగదాంబ జంక్షన్‌లో క్లాక్ టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇక విశాఖ నగరంలో ఈసరికి కొన్ని క్లాక్ టవర్స్ ప్రస్తుతం జివిఎంసి పరిధిలో ఉన్న

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పార్లమెంట్ ఓటింగ్‌లో విశాఖే అత్యల్పం...

ఉంది.

అత్యల్ప శాతం పెందుర్తిలో....

విశాఖ జిల్లాలో అత్యల్పంగా పెందుర్తి అసెంబ్లీ సెగ్మెంట్లలోనే 2019తో పోల్చితే మైనస్ 0.28శాతం నమోదైంది. 2019లో 74.72శాతం 2024లో 74.44శాతం పెందుర్తి అసెంబ్లీలో నమోదైంది. విశాఖ జిల్లాలో అత్యధికంగా ఓట్ల శాతం నమోదైన అసెంబ్లీ సెగ్మెంట్ పశ్చిమం. ఇక్కడ 11.60శాతం పెరిగింది. 2019 (58.19శాతం)తో పోల్చితే 2024లో 69.78శాతం నమోదైంది. అత్యధికంగా జిల్లాలో వృద్ధులు, మహిళలు, యువకులు, అన్ని తరగతుల ప్రజలు స్వచ్ఛందంగా 13న ఉదయం 7గంటల నుంచి ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ నగరంలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 2019-2024 ఎన్నికల సందర్భంగా పోలింగ్ శాతం పెరిగిన నియోజకవర్గాలు భీమిలి 2.06శాతం, తూర్పు 3.91శాతం, దక్షిణం 2.27శాతం, ఉత్తరం 1.78శాతం, పశ్చిమం 11.60శాతం, గాజువాకలో 4.49శాతం అదనంగా నమోదైంది. ఈ పెరుగుదలపై ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆందోళన నెలకొంది.

జగదాంబ జంక్షన్‌కు ఆకర్షణగా క్లాక్ టవర్

భీమునిపట్టణంలో 18వ శతాబ్దంలో డచ్ వారు నిర్మించిన భీమిలి క్లాక్ టవర్ రాష్ట్రంలోనే అత్యంత పురాతనమైనది. నగరంలో అత్యంత ప్రసిద్ధ ల్యాండ్ మార్క్‌గా కెజిహెచ్‌ను చెప్పవచ్చు. కెజిహెచ్‌లో నాలుగు అంతస్తులతో ఒక సుష్ట భవనాన్ని నిర్మించారు. ఈ భవనానికి మధ్యలో క్లాక్ టవర్‌ను ఏర్పాటు చేశారు. 1923 జులై 19న అప్పటి మద్రాస్ ప్రావెన్సీ ముఖ్యమంత్రి దివాన్ బహదూర్ పానుగంటి రామయ్యంగార్ ఈ భవనాన్ని ప్రారంభించారు.

ఆంధ్ర యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో కూడా క్లాక్ టవర్‌ను 1926-1932 మధ్య జైపూర్ మహారాజా నిర్మించారు. అదే సందర్భంలో పాత నగరంలోని కురుపాం మార్కెట్‌లో కూడా క్లాక్ టవర్ నిర్మాణం జరిగింది. అయితే అది శిథిలావస్థకు చేరటంతో జివిఎంసి దానిని తొలగించింది. ప్రస్తుతం జగదాంబ జంక్షన్‌లో నిర్మిస్తున్న క్లాక్ టవర్ నిర్మాణ పనులను అన్ని విధాల పూర్తి కావటానికి మరో ఆరు మాసాల వ్యవధి పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

సివిల్ సర్వీసు ర్యాంకర్ నరేంద్రపడాల్‌కు సన్మానం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : యుపిఎస్‌సి సివిల్ సర్వీసు పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో 545 ర్యాంక్ సాధించిన అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేటకు చెందిన ఆదివాసి యువకుడు చిట్టపులి నరేంద్రపడాల్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన బుధవారం సన్మానించారు. ఎంవిపి.కాలనీలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ఏజెన్సీ ప్రాంతం ఆశించినంతగా అభివృద్ధి కాలేదని, మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చినవారికి కష్టం విలువ తెలుస్తుందని, భవిష్యత్తులో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని నరేంద్ర పడాల్‌కు సూచించారు. అనంతరం గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొరాబు సత్యనారాయణ మాట్లాడుతూ, ఆదివాసీ యువకుడు యుపిఎస్‌సిలో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు రానున్న రోజుల్లో ఆయన అధికారం గిరిజనులకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఆయన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని ముున్ముందు మరింత మంది గిరిజన విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నంత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర పడాల్ తండ్రి దాల్ పడల్, తల్లి విజయ భారతి, గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖపట్నం వర్కింగ్ ప్రెసిడెంట్ డి.సాంబమూర్తి, కార్యదర్శి ఆర్.సత్యారావు, అధ్యక్షుడు ఎ.కోటేశ్వరరావు, సభ్యులు ఎల్.మహేంద్ర, ఒ.సింహాద్రి, కొక్కుల రామారావు, కిముడు రామారావు, ఓలేసు రామారావు, డాక్టర్ రాము, బి.తవుడన్న, కటారి శోభన్, మురాల ప్రసాద్ ఆఫీసు కార్యదర్శి గీత తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి ర్యాంకర్ నరేంద్రపడాల్‌ను సన్మానిస్తున్న వెలగపూడి

దబోల్కర్ హత్య కేసులో సూత్రదారులను శిక్షించాలి

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ప్రముఖ హేతువాది దబోల్కర్ హత్య కేసులో తీర్పుపై భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో కీలక సూత్రధారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ హేతువాది డాక్టర్ నరేంద్ర దబోల్కర్‌ను 2013 ఆగస్టు 20వ తేదీన ఓంకారేశ్వర బ్రిడ్జిపై మార్నింగ్ వాకింగ్ చేస్తుండగా సంఘ పరివార్ దుండగులు దారుణంగా కాల్చి చంపారని తెలిపారు. దీనిపై పూణేలోని ప్రత్యేక కోర్టు సచిన్ అందూరే, శరత్ కలాస్కర్లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఈ నెల 10న తీర్పు ఇచ్చిందని తెలిపారు. హత్యకు కీలక సూత్రధారులైన వీరేంద్ర తవాకే, అడ్వకేట్ సంజీవ్ పునలేకర్, విక్రమ్ భావాలను నిర్దోషులుగా విడుదల చేసిందని తెలిపారు. వారిపై నేరాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమవడంపై తమ సంస్థ అసంతృప్తి వ్యక్తం చేస్తుందని స్పష్టం చేశారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చట్టం చేయాలని కోరుతూ దబోల్కర్ దీర్ఘకాలంగా పోరాడారని గుర్తు చేశారు. ఆయన మరణించిన తరువాత ప్రభుత్వం చట్టం చేసిందని, అయితే దబోల్కర్ హత్యకు సూత్రధారులను శిక్షించుటకు మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాల్సిందిగా కోరారు. మీడియాతో మాట్లాడిన వారిలో భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, వై.నూకరాజు ఉన్నారు.

చంద్రబాబు విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేయాలి

తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్

గండి బాబ్జీని కలిసి అభిప్రాయాన్ని తెలుపుతున్న బివి.రామ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్రలోని కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు విశాఖపట్నంలోనే ప్రమాణ స్వీకారం చేయాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇదే విషయమై ఆయన టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జిని బుధవారం పార్టీ కార్యాలయంలో కలిసి తన అభిప్రాయం తెలిపారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనను ఐదేళ్లపాటు ప్రజలు భరించారన్నారు. ఎన్నికలలో వైసిపికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన సంబరాలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. మరోవైపు వైసిపి నాయకులు ఓటమిపాలవుతామనే భావనతో దాడులకు దిగుతున్నారన్నారు. తెనాలిలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ తన అనుచరులతో కలిసి ఓటర్‌పై దాడి చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అన్నారు. మంగళవారం పద్మావతి యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలనకు వెళ్లిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులిపర్తి నానిపై విచక్షణ రహితంగా దాడి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఓడిపోతామనే అభద్రతాభావంతో వైసిపి శ్రేణులు దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి, ఎక్కడా రీపోలింగ్‌కు తావు లేకుండా తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించారని అభినందనలు తెలిపారు. గండి బాబ్జిని కలిసిన వారిలో మండవ జ్యోతి, ఎన్.భార్గవి, బి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ వార్షికోత్సవ ఆఫర్లు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఎల్‌జి 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారుల సౌలభ్యం కోసం ఉత్పత్తులపై "లైఫ్ గుడ్ ఆఫర్స్"ను ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ ఎమ్‌డి హాంగ్ జు జియోన్ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా వినూత్నమైన ఉత్పత్తులతో వినియోగదారులకు గొప్ప అనుభూతిని అందజేస్తున్నామని తెలిపారు. ఈ ఆఫర్ ద్వారా ఎంపిక చేయబడిన ఉత్పత్తులపై 27 శాతం వరకు క్యాష్ బ్యాక్, కేవలం రూ.27 చెల్లించి ఉత్పత్తులు ఎలా సొంతం చేసుకోవచ్చు అనే దానిపై అవగాహన కల్పించారు. ఈ ఆఫర్లు ఈ నెల 11వ తేదీ వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కృష్ణాజి, బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో జీవ వైవిధ్య దినోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఈ నెల 22, 23 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డితో కలిసి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ కార్యదర్శి డాక్టర్ బి.బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 22న బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు, ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. 23న ఎయు వృక్షశాస్త్ర విభాగంతో కలిసి ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహిస్తారు.

డయల్ యువర్ సీపీకి 29 ఫిర్యాదులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రతి నెలా 01, 15వ తేదీలలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ ఆధ్వర్యాన నిర్వహించే డయల్ యువర్ సీపీ కార్యక్రమం బుధవారం కమిషనరేట్‌లో నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ 0891-2523408 నంబరు ద్వారా అందుబాటులో ఉండి 22 మంది కాలర్స్‌తో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కాలర్స్ ఇచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, సివిల్ కేసులు, వ్యాపారం కోసం నగదు ఇచ్చి మోసపోవటం, నగర ట్రాఫిక్ సమస్యలపై ఫిర్యాదులు ఉన్నాయి. అనంతరం వృద్ధుల ఫిర్యాదుల కోసం 12 నుంచి 12:30 వరకు అదనముగా కేటాయించిన సమయంలో ఏడు ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో జి-సెక్షన్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే వైసిపి దాడులు : టిడిపి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో ఓటమి తప్పదని ఓర్వలేని తనంతోనే వైసిపి దాడులకు దిగుతోందని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ ఆరోపించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుపతిలో టిడిపి అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడిని ఖండించారు. అధికార పార్టీకి చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొడుకు చేసిన దౌర్జన్యం ప్రజాస్వామ్యానికే మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన అవకాశాన్ని జగన్మోహన్‌రెడ్డి దుర్వినియోగం చేసి, భారీ ఎత్తున వనరులను దోచుకున్నారని ఆరోపించారు. దానికి ఫలితం అనుభవిస్తారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గొంప సత్యనారాయణ, జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాఖలో అపోలో విరాట్ టైర్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆటోమోటివ్ టైర్ టెక్నాలజీలో అగ్రగామిగా ఉన్న అపోలో టైర్స్ రైతుల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన 'అపోలో విరాట్' టైర్‌ను బుధవారం విశాఖ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ఇసుకతోట వద్ద ఉన్న కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ శక్తి మీడియాతో మాట్లాడుతూ, అపోలో విరాట్ టైర్లు అసమానమైన సామర్థ్యం కలిగి మన్నికను ఇస్తాయని తెలిపారు. వ్యవసాయ నిబంధనలను పునర్నిర్వచించటానికి సిద్ధంగా అధునాతన డబుల్ గ్రిప్ టెక్నాలజీ, లగ్ డిజైన్‌ను కలిగి ఉన్న అపోలో విరాట్ టైర్లు విభిన్నమైన వ్యవసాయ పరిస్థితులను తట్టుకోగల రీతిలో ఉన్నాయని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.A. No. 384/2023 in O.S. No. 174/2023

Between:
Smt. Andhavarapu Sunitha
W/o. Sri Venkata Koteswara Rao
. . . Petitioner/Plaintiff
And:
Smt. Relangi Padma Sree Valli
And 3 another
. . . Respondents / Defendants
To,
4th Respondent:
Sri, Relangi varaha Lakshmi Narasimha Giridhar
S/o. late R. Veerabhadra Rao,
R/o. D.No.21-4-15, Masjit Street,
A.V.N. College Down,
Visakhapatnam-530001.

Please take notice that the above petitioner filed above petition in above suit against you and others and the same stand posted to **16-07-2024,** for your appearance on that day at 10.30hrs A.M. before the Honourable Court either personally or through an advocate. If you are failed to attend before the honourable Court on **16-07-2024 at 10-30 A.M.** the matter will be decide in your absence

S.V. RAMANA
S.SATYAVENI, Advocates
flat no. 8, Bhaskar Suvasa Apartments, Kailash Metta, Waltair Uplands, Near Sampath Vinayak Temple, Visakhapatnam.
Cell : 98494 00676

IN THE HONOURABLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S. No. 174/2023

Between:
Smt. Andhavarapu Sunitha
W/o. Sri Venkata Koteswara Rao
. . . Plaintiff
And:
Smt. Relangi Padma Sree Valli
And 3 another
. . . Defendants
To,
4th Defendant:
Sri Relangi Varaha Lakshmi Narasimha Giridhar
S/o. late R. Veerabhadra Rao,
R/o. D.No.21-4-15, Masjit Street,
A.V.N. College Down,
Visakhapatnam-530001.

Please take notice that the above petitioner filed above suit against you and others and the same stand posted to **16-07-2024,** for your appearance on that day at 10.30hrs A.M. before the Honourable Court either personally or through an advocate. If you are failed to attend before the honourable Court on **16-07-2024 at 10-30 A.M.** the matter will be decide in your absence

S.V. RAMANA
S.SATYAVENI, Advocates
flat no. 8, Bhaskar Suvasa Apartments, Kailash Metta, Waltair Uplands, Near Sampath Vinayak Temple, Visakhapatnam.
Cell : 98494 00676

గ్రంథాలయానికి వసతి కష్టాలు..!

పెదగంట్యాడ గ్రంథాలయ భవనం

- కాగితాల్లోనే అదనపు భవన నిర్మాణం
- నిధులు మంజూరైనా కదలని పనులు
- ఉన్న భవనాన్ని తొలగించిన అధికారులు
- అరకొర వసతితో పాఠకుల అవస్థలు

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ గ్రంథాలయానికి అదనపు భవన నిర్మాణం రెండేళ్లుగా కాగితాల్లోనే మూలుగుతోంది. నిధులు మంజూరైనా ఆర్థికపరమైన అనుమతులు లేవన్న కారణంతో పనులు చేపట్టడం లేదు. దీంతో అందుబాటులో ఉన్న భవనాన్ని తొలగించి, కొత్త భవనం నిర్మించకుండా వదిలేయడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు.

పెద గంట్యాడ మండలంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు అనుబంధంగా ఉన్న పౌరగ్రంథాలయానికి వసతి ఇక్కట్లు తప్పడంలేదు. రోజూ సగటున 200మంది పాఠకులు సందర్శించే ఈ గ్రంథాలయానికి ప్రస్తుతం ఉన్న గ్రంథాలయానికి ఆనుకొని ఉన్న సామాజిక భవనాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఈ లోగా కమ్యూనిటీ భవనం శ్లాబ్ లీకవుతుండడంతోదాన్ని మరమ్మతులు చేయాలని భావించారు. శ్లాబ్‌ను తొలగించి, ఉన్న గోడలపైనే కొత్తగా శ్లాబ్‌ను వేయాలని అధికారులు భావించారు., పాత స్లాబ్‌ను తొలగించిన తర్వాత గోడలను పరిశీలించిన అధికారులు, వాటి నాణ్యత బాగోలేదని, ఏకంగా కొత్త భవనాన్ని పునర్నించాలంటూ రూ.19లక్షలతో అంచనా ప్రతిపాదనలు కూడా రూపొందించారు. ఈ మేరకు నిధులు మంజూరైనా వాటికి ఆర్థికపరమైన అనుమతి లేదంటూ రెండేళ్లుగా పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు.

కొత్త భవనం నిర్మాణ కాకపోవడం, గ్రంథాలయానికి వచ్చిన పాఠకుల సంఖ్య పెరగడంతో, ఉన్న భవనంలో కూర్చోవడానికి స్థలం సరిపోవడం లేదు. విలువైన పుస్తకాలు భద్రపరచడానికి కూడా ఉన్న భవనం సరిపోకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల దగ్గర పుస్తకాలను భద్రపరుస్తున్నారు. దీంతో కొన్ని పుస్తకాలు మాయమైపోతున్నాయని గ్రంథాలయ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాగిరెడ్డి కూడా గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మాటిచ్చారే తప్ప, పనుల్లో ముందుకు సాగని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయ అదనపు భవనం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. .

పాత భవనం శ్లాబు తొలగించడంతో మిగిలిన మొండిగోడలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మృతుడు గుమ్మడి మధు (ఫైల్)

ప్రజాశక్తి -మధురవాడ: జాతీయ రహదారిపై మధురవాడ కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మతి చెందాడు సిఐ వై రామకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఆరో వార్డు సాయిరాం కాలనీకి చెందిన గుమ్మడి మధు(52) కార్‌షెడ్ వైపు నుండి కొమ్మాది వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, అదే మార్గంలో గుర్తు తెలియని లారీ మధురవాడ కూడలి వద్ద మధు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ వెళ్లిపోయింది. ఘటనపై మృతునికుమారుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సిఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి మృతి

చిన్న (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -మధురవాడ: విద్యుత్ షాక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు పిఎం పాలెం సిఐ రామకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జివిఎంసి ఏడో వార్డు డాక్‌యార్డు కాలనీకి ఎస్. చిన్న (27) వృత్తిరీత్యా రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటాడు. ఈనెల 4వ తేదీన శివశక్తి నగర్ రోడ్‌లో ఉన్న ఓ నూతన భవన నిర్మాణ పనులకు రాడ్ బెండింగ్ పనులు చేస్తుండగా, ఆ రాడ్ విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.మృతునికి భార్య,ఐదేళ్ల పాప ఉంది.

మానవీయ విలువలపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థులకు కోర్సులకు సంబంధించిన అంశాలతో పాటు విశ్వజనీనమైన మానవతా విలువలను, ప్రస్తుత సమాజంలో వాటి ప్రాధాన్యతను తెలియజెప్పాల్సిన అవసరం ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు అన్నారు. బుధవారం గీతంతో పాటు నగరంలోని వివిధ కళాశాల అధ్యాపకులకు 'విశ్వజనీనమైన మానవత విలువలతో కూడిన విద్యాబోధన' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆచార్య గౌతంరావు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో యువతరంపై ముఖ్యంగా విద్యార్థులలో సమాజం పట్ల బాధ్యత, వృత్తి విలువలు పాటించడం, జీవితంలో ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగడం వంటివి అధ్యాపకులే మార్గదర్శకం చేయాలని సూచించారు. నూతన విద్యా విధానంలో భాగంగా సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు మానవతా విలువలను బోధించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. డాక్టర్ పివి. లక్ష్మి సమన్వయపరిచిన కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ నిపుణులు ఉమేష్ జాదవ్, డాక్టర్ జగదీష్ బాబు, డాక్టర్ శ్రీజ మధు పాల్గొన్నారు.

గీతంలో కాటన్‌కు ఘననివాళి

కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతిని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్ భవనంలో నిర్వహించిన జయంతి సభలో గీతం ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతంరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ముకుంద్ సీనియర్ ప్రొఫెసర్లు ఎమ్. రమేష్, తదితరులు పాల్గొని కాటన్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్షయవ్యాధి నివారణ టీకాలు

ప్రతి గురువారం పిహెచ్‌సిల్లో బిసిజి వ్యాక్సినేషన్

ప్రజాశక్తి -ఆనందపురం : పెద్దవారికి క్షయ వ్యాధి రాకుండా బిసిజి టీకాలు వేసే కార్యక్రమం ఈ నెల 16న, గురువారం నుంచి ప్రారంభం కానుందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు సూచించారు. మండలంలో ఎంపిక చేసిన నాలుగు వేల మందికి ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లలో టీకాలు వేస్తామన్నారు. మధుమేహం, ధూమపానం అలవాటు ఉన్నవారు 60ఏళ్లు దాటిన వృద్ధులు, ఇంట్లో వేరెవరికైనా క్షయవ్యాధి ఉంటే వారి కుటుంబీకులు ఈ టీకాలను వేయించుకోవాలని సూచించారు. మే, జూన్ నెలల్లో ప్రతిగురువారం క్షయవ్యాధి నివారణకు పెద్దలకు బిసిజి టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తామని, అర్హులు వినియోగించుకోవాలని సూచించారు.దీనిపై ఇప్పటికే సిబ్బందికి అంగన్వాడీలు, ఆశాలకు శిక్షణనిచ్చామన్నారు. సిహెచ్ఓ పి.సాంబమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణమోహన్ ఉన్నారు.

ఏదీ ఆ హడావిడి!

- ఎన్నికలకు ముందు ఆర్భాటంగా రోడ్డు పనులు
- మెటల్ వేసి వదిలేసిన నేతలు, అధికారులు
- అధ్వానస్థితిలో బిపి.కల్లాలు రోడ్డుతో అవస్థలు

నిండా గోతులతో ఉన్న బిపి కల్లాలు రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో బంటుపల్లి కల్లాలు గ్రామపంచాయతీ పరిధిలో అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులపై ఎన్నికలకు నెలరోజుల ముందు ఎక్కడలేని హడావిడి చేశారు బిపి కల్లాలు కాలనీ నుండి చందక వారి కల్లాల వరకు సుమారు 800 మీటర్ల రోడ్డు అధ్వానరోడ్డుపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఎకాఎకిన స్పందించి, అంచనా ప్రతిపాదనలు రూపొందించారు. రూ.ఎనిమిది లక్షలు అవసరమని అంచనా వేస్తే, రూ.నాలుగు లక్షలు మంజూరు చేయడం, రోడ్డు పనులను ఆర్భాటంగా ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. అంతవరకు బాగానే ఉన్నా, ఆ తర్వాతే పనులు ముందుకు కదలలేదు. హడావిడిగా బ్లాక్‌మెటల్ వేసి పనులు చేయకుండా మధ్యలోనే వదిలేశారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం బంటుపల్లి కల్లాలు, పల్లిపేట ఆకుల వారి కల్లాలు, దొంతల వారి కల్లాలు, నాయుడుగారి కల్లాలు తదితర గ్రామాల నుండి రైతులు తెల్లవారుజామున రెండు గంటలకే కాయగూరలు తీసుకుని వస్తుంటారు. అంతేకాక నిత్యం అనేక వాహనాలు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డు గోతులమయమై అధ్వానంగా ఉండడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వెంటనే రోడ్డును బాగు చేయాలని పలువురు. కోరుతున్నారు.

రాజకీయ కక్షల వల్లే పార్టీ వీడాను..

- మాజీ ఎంపిపి దంతులూరి గోపీరాజు

ప్రజాశక్తి -పద్మనాభం : కక్ష రాజకీయాల వల్లే తాను పార్టీ మారాల్సి వచ్చిందని మాజీ ఎంపిపి దంతులూరి గోపాలకృష్ణమూర్తి రాజు (గోపిబాబు) అన్నారు. బుధవారం పద్మనాభంలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో తన ఆవేదన వెల్లగక్కారు. తనను వైసిపికి దూరం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఎన్నో కుట్రలు చేశారనియ అయితే పార్టీలో తనకున్న పలుకుబడిని గుర్తించిన పార్టీ ఏనాడూ తనను తొలగించలేదన్నారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ముత్తంశెట్టికే భీమిలి వైసిపి ఎమ్మెల్యే టిక్కెట్ ఖరారు చేయడంతో ఆయనను ఎలాగైనా ఓడించాలనే ఉద్దేశ్యంతోనే పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, లోకేష్ పిలుపుమేరకు టిడిపిలో చేరానని, తనను టిడిపి కూడా అదేరీతిన గౌరవించిందన్నారు. తనకున్న పరిచయాలు, పలుకుబడిని ఉపయోగించి మండలంలోని 22పంచాయతీల్లో టిడిపి విజయానికి విస్తృతంగా పనిచేశానని, అన్ని పంచాయతీల్లోనూ 90శాతం వరకు ఓట్లు టిడిపికే పడ్డాయన్నారు. ముత్తంశెట్టికి టిక్కెట్ ఇవ్వకుంటే తాను వైసిపిలోనే ఉండేవాడినని స్పష్టం చేశారు. .అనంత పద్మనాభస్వామి సేవా సంఘం ద్వారా చేపట్టిన ఎన్నో సేవా కార్యక్రమాలతో మండల ప్రజలు తనను మంచిగానే ఆదరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 13న ఎన్నికల రోజున రెడ్డిపల్లిలో రాత్రి ఏడున్నర గంటలకు కొంతమంది తన కారును అడ్డగించి దాడికి యత్నించారని, వారిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

పాడైన బోరును పట్టించుకోరా.?

పిచ్చిమొక్కలు మధ్య హెడ్ తీసేసిన బోరు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామంలో మంచినీటి బోరు మరమ్మత్తులకు గురికావడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం పాడైన ఈ బోరును బాగుచేయాలని పదేపదే అధికారులు, పంచాయతీకి మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేదన్నారు. బోరు మరమ్మతులు పేరిట హెడ్‌ను తొలగించి, దానికి ఒక గోనెను చుట్టి అలాగే వదిలేశారని స్థానికులు అంటున్నారు.ప్రస్తుతం వేసవి సీజన్‌లో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఆ బోరును బాగుచేయించి వినియోగంలోకి తెస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు.

గురుకుల కాలేజీల్లో మిగులు సీట్ల భర్తీకి
నేడు, రేపు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఉమ్మడి విశాఖ జిల్లాలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో మిగిలిన ఇంటర్ ఫస్టియర్ సీట్ల భర్తీకి ఈనెల 16,17 తేదీల్లో అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రెండు జిల్లాల గురుకులాల సమన్వయకర్త యస్. రూపవతి తెలిపారు. ఈనెల 16న సబ్బవరం గురుకులంలో బాలురకు, 17న మధురవాడలోని అంబేద్కర్ గురుకులంలో బాలికలకు అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. .కౌన్సెలింగ్ కు హాజరగు విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ తో పాటు ర్యాంక్ కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మార్క్ లిస్ట్, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్ సీట్ల భర్తీకి మార్చి 10న నిర్వహించిన ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు విశాఖ జిల్లాలోని మూడు గురుకుల కాలేజీలు, అనకాపల్లి జిల్లాలోని ఎనిమిది గురుకులాల్లో ఇప్పటికే ఆన్‌లైన్‌లో సీట్లను భర్తీ చేశామన్నారు. మిగిలిన సీట్ల భర్తీకి మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ఆధారంగా భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్దేశించిన గురుకులాలకు ఉదయం తొమ్మిది గంటలకు అన్ని విద్యార్హతలు, ర్యాంకు కార్డులు ఇతర సర్టిఫికెట్లతో అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

లోలోన భయం... పైకి గాంభీర్యం..
గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

- భీమిలిలో 75.96 శాతం పోలింగ్
- నవరత్నాలుపైనే వైసిపి విశ్వాసం
- ప్రభుత్వంపై వ్యతిరేకత, సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి గంపెడాశలు
- కూడికలు, తీసివేతల్లో ప్రధాన పార్టీల నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్‌రూంల్లోని ఇవిఎంలలో నిక్షిప్తమై ఉంది. వచ్చేనెల 4న కౌంటింగ్‌కు మరో 20రోజుల గడువు ఉండనే ఉంది. ఈలోగా పోటీ అభ్యర్థులు, వారిని బలపరిచిన పార్టీశ్రేణులు, అభిమానులు ఎవరికి వారే పోలింగ్ సరళిని సమీక్షిస్తూ గెలుపు అంచనాలపై లెక్కలు వేసుకుంటున్నారు. లోలోన గుబులు ఉన్నా, పైకి మాత్రం గాంభీర్యం ప్రదర్శిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. భీమిలి నియోజకవర్గంలో ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 75.96 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో 73.90 శాతం నమోదైంది.గతం కంటే ప్రస్తుతం 2 శాతం పెరిగింది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 3లక్షల63 వేల 13 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2 లక్షల 75 వేల 747మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు ఇందులో మహిళలు లక్ష 40 వేల 446 మంది, పురుషులు లక్ష 35 వేల 301 మంది ఓటేశారు. గతం కంటే అధికంగా పోలింగ్ నమోదు కావడం, ముఖ్యంగా మహిళా ఓట్లు ఎక్కువగా పోలవ్వడం అది తమ విజయానికి సంకేతమని అటు వైసిపి, ఇటు టిడిపి ఎవరికి వారే ధీమా వ్యక్తం జేస్తున్నాయి.



సంక్షేమ పథకాలపై వైసిపి విశ్వాసం

భీమిలి నియోజక వర్గంలో పోలింగ్‌శాతం గతం కంటే ఎక్కువగా 71.14 శాతం నమోదు కావడం, అందులోనూ మహిళా ఓటర్లు పెద్దసంఖ్యలో ఓట్లేయడంతో వైసిపిపై గెలుపుపై ఆశలు పెంచాయి. నవరత్న పథకాలను ఎక్కువగా మహిళా లబ్ధిదారుల పేరునే ఇవ్వడంతో వారంతా తమకే ఓటు వేసి ఉంటారన్న వైసిపి గట్టినమ్మకంతో ఉంది.అమ్మ ఒడి, చేయూత, కాపు నేస్తం, ఇబిసి నేస్తం, డ్వాక్రా సున్నా వడ్డీ, జగనన్న ఇల్లు, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ, విద్యా, వసతిదీవెన వంటి సంక్షేమ పథకాలు తమకు ఓట్లు తెచ్చి పెడతాయని అధికార వైసిపి నేతలు, గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలు లెక్కలు వేస్తున్నారు. 2024 మ్యానిఫెస్టోతో యువతలో కొత్త ఆశలు చిగురించాయని, కొత్తగా ఓటు వేసిన వారంతా తమ వెన్నంటే ఉన్నారని అంటున్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై గంపెడాశలతో టిడిపి..

ఓటింగ్ సరళి చూస్తే ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన సూపర్ సిక్స్ పథకాలు తమను గెలిపిస్తాయని టిడిపితో సహ కూటమి నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఏటా మూడు ఉచిత వంటగ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం, 18ఏళ్ల నిండిన మహిళలకు ప్రతినెలా రూ.1500 వంటి పథకాలను మహిళలు స్వాగతించారని, కూటమిపార్టీలకే ఓటేశారనడానికి పోలింగ్ సరళి తేటతెల్లం చేస్తుందని అంటున్నారు. యువతకు నెలసరి నిరుద్యోగభృతి రూ.3వేలు, 20లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వంటివి యువతను ఆకర్షించి, కూటమికి ఓట్లేసేలా చేశాయని లెక్కలు వేస్తున్నారు. రైతులకు ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం గ్రామీణ ప్రాంతంలో రైతుకుటుంబాలు ఓట్లేసేలా చేసిందని, ఇక ప్రతి విద్యార్థికి రూ.20వేలు విద్యాసాయం అందరినీ మెచ్చేలా చేసిందన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా రాత్రి వేళల్లోనూ క్యూలైన్లలో నిల్చోబెట్టి కూటమికి ఓట్లు తెచ్చిపెట్టిందని అంటున్నారు.

టిడిపిదే రికార్డు విజయం : గంటా

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- భీమునిపట్నం : నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే టిడిపి ఘనవిజయం ఖాయమని స్పష్టమౌతోందని టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోలింగ్ సరళిపై పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీ పోలైన ఓట్లు, వాటిల్లో టిడిపికి నమోదైన ఓట్లపై ఆయా గ్రామస్థాయి నేతలతో సుదీర్ఘంగా సమీక్షించిన మీదట టిడిపి గెలుపుపై స్పష్టత వచ్చిందన్నారు. 2014లో తనకు వచ్చిన 37వేల పైచిలుకు మెజారిటీని ప్రస్తుత ఎన్నికల్లో బ్రేక్ చేయనున్నట్లు వెల్లడించారు. ఇటు భీమిలితోపాటు విశాఖ జిల్లాలోని ఎంపీ, ఇతర ఎమ్మెల్యే స్థానాల్లోనూ, అటు రాష్ట్రంలోనూ కూటమిదే విజయం ఖాయమని, వచ్చేనెల 9న సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తారని స్పష్టం చేశారు. వైసిపికి రాష్ట్రంలో రెండంకెల స్థానాలు దక్కడం గగనమేనన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి పనిచేసిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు,అభిమానులకు, ఓటేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, జనసేన నాయకులు ఎస్ శ్రీనివాస్, బిజెపి నేత కె రామానాయుడు పాల్గొన్నారు

పేరుకుపోయిన చెత్తతో ఇబ్బందులు

శాంతిపురం జంక్షన్‌లో చెత్తకుప్ప

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు శాంతిపురం జంక్షన్‌లో మూడు రోజులుగా చెత్తకుప్పలు పేరుకుపోవడంతో ఆ మార్గంలో నడిచే పాదచారులు వాహనదారులు తీవ్ర ఇబ్బందికి గురౌతున్నారు. నిల్వ ఉన్న చెత్త నుంచి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జివిఎంసి పారిశుధ్యవిభాగం వెంటనే స్పందించి, మూడురోజులుగా మురిగిపోతున్న చెత్తను వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు

డిఆర్ఎంను కలిసిన రైల్వే శ్రామిక్ యూనియన్

డిఆర్ఎంను అభినందిస్తున్న శ్రామిక్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి- మాధవధార : ఈస్ట్‌కోస్టు రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కోఆర్డినేటర్‌గా పప్పల రామమోహనరావు.ఎన్నికైనట్లు అధికారిక ఉత్తర్వులు వెలువడిన సందర్భంగా శ్రామిక్ యూనియన్ ప్రధానకార్యదర్శి పికె. పట్నాయక్ నాయకత్వంలో శ్రామిక్ యూనియన్ నాయకులు, కార్యకర్తలతో భారీ ఎత్తున తరలివెళ్లి డివిజనల్ రైల్వే మేనేజర్, ఇతర రైల్వే ఉన్నత అధికారులను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈనెల 5వ తేదీన భువనేశ్వర్‌లో జరిగిన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో విశాఖపట్నం డివిజన్ డివిజనల్ కోఆర్డినేటర్‌గా పప్పల. రామ్మోహనరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన రావుతోపాటు జోనల్ అధ్యక్షులు పివిజె రాజు, డిప్యూటీ డివిజనల్ కోఆర్డినేటర్ చందన్ కుమార్‌లను డిఆర్ఎంకు పట్నాయక్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా పట్నాయక్ మాట్లాడుతూ, కార్మిక సమస్యలను పరిష్కరించడంలోనూ, రైల్వేల ప్రగతిలో యాజమాన్యానికి ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ఎల్లప్పుడు సహకరిస్తుందన్నారు. అదే సమయంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాన్ని కూడా చేస్తుందని స్పష్టం చేశారు. కాగా ఈస్టుకోస్టు రైల్వే విశాఖ డివిజనల్ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన పప్పల రామమోహనరావు 2018లోనే శ్రామిక్ కాంగ్రెస్ డివిజనల్ కోఆర్డినేటర్ గా పనిచేశారు. ఇప్పుడు రైల్వేలలో గుర్తింపు కలిగిన అతి పెద్ద కార్మిక ఫెడరేషన్ ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్‌లో కూడా ఈ పదవిని అలంకరించడం విశేషం. రెండున్నర దశాబ్దాలుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ నిజాయితీ నిబద్ధతతో కూడిన కార్మిక పక్షపాతిగా కార్మికుల మన్ననలను పొందిన రామ్మోహనరావును పలువురు కార్మికులు, కార్మిక నేతలు అభినందించారు.

ఉత్తర పీఠం వైసిపిదే : రాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైసిపిమంచి మెజార్టీతో విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ వార్డుల ముఖ్యనేతలతో పోలింగ్ సరళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వారీగా పడిన ఓట్లు, ఎవరెవరికి ఎన్నెన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉందో కూలంకషంగా చర్చించారు. అనంతరం కెకె.రాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోని ఓటింగ్ సరళిపై లోతుగా సమీక్షించామని, ఉత్తర పీఠాన్ని వైసిపి కైవసం చేసుకోవడం ఖాయమని స్పష్టతకు వచ్చామన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ , పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భీమిలిలో వైసిపిదే గెలుపు : ముత్తంశెట్టి

సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమునిపట్నం : తాజా ఎన్నికల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తే వైసిపిదే గెలుపు అని తేటతెల్లం అయిందని వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం జేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిపై పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఎన్నికల కంటే ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడాన్ని ప్రస్తావిస్తూ, మహిళా ఓట్లలో ఎక్కువ శాతం వైసిపికే పడే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ఓటర్లు కూడా వైసిపి వైపు మొగ్గు చూపారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో వైసిపి విజయానికి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్య వాదాలు తెలిపారు కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు

19న జూలో జీవ వైవిధ్యంపై పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆధ్వర్యంలో ఈ నెల 19న విద్యార్థులకు జీవవైవిధ్యంపై ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందని సలారియా తెలిపారు. జూపార్కులోని బయోస్కోప్ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి జరగబోవు ఈ పోటీలకు ఒకటవ తరగతి నుంచి పిజి వరకు చదువుతున్న విద్యార్థులంతా ౹ ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణపై అవగాహన కలుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్, మెరిట్ సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు.ఆసక్తిగల విద్యార్థులు 78936 32900 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఎండిన చెరువులు

- అడుగంటిన భూగర్భ జలాలు
- ప్రజలకు, పశువులకు తాగునీటి సమస్య
- సబ్సిడీపై బోర్లు మంజూరు చేయాలని వేడుకోలు

ఎండిపోయిన దుప్పుతూరు చెరువు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎండలు మండిపోతుండడంతో మండలంలోని సుమారు 80 చెరువులు ఎండిపోయాయి. చుక్క నీరు లేక బీటలు వారాయి. అచ్యుతాపురం మండలం పూర్తిగా మెరక ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు అడిగింటాయి. సుమారు 400 అడుగుల లోతులో కూడా నీరు దొరకడం కష్ట సాధ్యంగా మారింది. మండలంలోని చౌడపల్లి, వెదురువాడ, గొర్లి ధర్మవరం, మార్టూరు, కుమారపురం, అచ్యుతాపురం, దుప్పుతూరు, భోగాపురం, జంగులూరు, బడుతూరు, మడుతూరు, ఆవ సోమవారం, దోసూరు, రాజానపాలెం, దొప్పర్ల తదితర గ్రామాలలో చెరువులలో ఉండే నీటిపైనే పశువులు ఆధారపడి దాహాన్ని తీర్చుకునేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో పురాతన కాలం నుంచి ఉన్న నేల బావులు, వ్యవసాయ బావులు, చెరువులు వర్షాలు లేక ఎండిపోయాయి. చెరువులలో నీరు తాగడం అలవాటుగా మారిన ఈ ప్రాంత పాడి పశువులకు మండుటెండల కారణంగా చెరువులలో చుక్కనీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

కొన్ని గ్రామాల్లో మనుషులు కూడా మంచినీరు సమస్య ఎదుర్కొంటున్నారు. గృహాల వద్ద కోసిన గొట్టపు బావులు కూడా ఎండిపోయి నీరు రావడంలేదని గృహ యజమానులు లబోదిబోమంటున్నారు. గహ అవసరాల కోసం 200 నుంచి 300 అడుగుల లోతు గొట్టపు బావులు తవ్వించడానికి సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అంతా ఆర్థిక భారం తాము మోయలేదని ప్రజలు అంటున్నారు. నీరు లేకపోవడంతో అనేక మంది అప్పు చేసిన కొత్తగా బోర్లు వేయించుకున్నారు. పాడి పశువులకు దాహార్తిని తీర్చడానికి అంత మొత్తంలో ఖర్చు పెట్టడం రైతులకు సవాల్‌గా మారింది. రైతులకు పంట పొలాలలో వ్యవసాయ బోర్లు వేయటానికి ప్రభుత్వం సబ్సిడీపై గొట్టాలు, విద్యుత్ మోటారు, మంజూరు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. భూగర్భ జలాలు ఏ ప్రదేశంలో ఉన్నాయో జియాలజిస్ట్ ద్వారా ఉచితంగా సర్వే చేయించి రైతులకు సూచనలు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కృష్ణారావును సత్కరిస్తున్న జైలు అధికారులు, సిబ్బంది

ఉప కరాగార అధికారి కృష్ణారావుకు సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి సబ్‌జైల్ జిల్లా ఉపకారాగార అధికారి బి.కృష్ణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. సబ్‌జైల్ పర్యవేక్షణాధికారి వైఎన్.గణేష్ రెడ్డి చేతుల మీదుగా బి.కృష్ణారావును దుశ్శాలువా, పూలమాల వేసి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణారావు 31 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జైళ్లలో వివిధ హోదాల్లో పని చేశారని తెలిపారు. ఏ విధమైన రిమార్కులు లేకుండా తను పని చేసిన కాలంలో జైళ్ల శాఖలో అనేక సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా జైళ్లలోని ఖైదీల పరివర్తనకు కృషి చేశారని కొనియాడారు. ఉత్తమ అధికారిగా మంచి పేరును సంపాధించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ జైల్ హెడ్ వార్డర్ బల్లా నాగభూషణ, జైల్ సిబ్బంది, రిమాండ్ ఖైదీలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి రింగరోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాలు కుటుంబాన్ని వదిలి, పార్టీయే ప్రాణంగా ఆర్థికంగా, సామాజికంగా, అన్ని విధాల పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. 13న జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కొణతాలు రామకృష్ణకి గాజు గ్లాస్ పై, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు కమలం గుర్తుపై ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అనకాపల్లి ఎమ్మెల్యే సీటు పొత్తులలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించినా కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్ గెలుపు కోసం మాజీ శాసనసభ్యులు పీలా గోవింద్ సత్యనారాయణ గత 50 రోజుల నుండి అనకాపల్లి నియోజకవర్గం అంతా పర్యటించి గెలుపు కోసం కృషి చేశారని చెప్పారు. పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, అనకాపల్లి పార్లమెంటులో పరిధిలో అధిక స్థానాలు గెలుచుకుంటున్నామని చెప్పారు. కొణతాల రామకృష్ణకి 30 వేలు పైగా, సీఎం రమేష్‌కి 80వేలుకు పైగా మెజార్టీ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ అల్లుడు భీమరశెట్టి రాంకీ, పోలవరపు త్రినాధ్, బొద్దప్పు ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రైనీ ఐపిఎస్‌లకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయవంతంగా ఎన్నికలు విధులు పూర్తి చేసిన 9 మంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనీ ఐపీఎస్‌లను ఎస్పీ మురళీకృష్ణ, పోలీస్ ఎన్నికల పరిశీలకులు మోహన్ ఎం దహిఖర్ బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో బందోబస్తు, భద్రత ఏర్పాట్ల విషయంలో విజయవంతంగా విధులు పూర్తి చేశారన్నారు. బలగాల సమీకరణ మోహరింపు, భద్రత సమస్యల పరిష్కారం, సివిల్ పోలీస్ పరిపాలన సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. వీటితో పాటు జిల్లా పోలీసులు, పేరా మిలటరీ దళాలతో కవాతు నిర్వహించడం, సెక్టార్ మొబైల్ ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా బృందాలతో పని చేయడం, కంట్రోల్ రూమ్ చెక్ పోస్టులు, పోలింగ్ బూత్, కౌంటింగ్ సెంటర్లు, ఈవీఎం నిల్వ కేంద్రాల పర్యవేక్షణ, ఎన్నికల అబ్జర్వేషన్, ఎన్నికల వ్యయ పరిశీలకులతో పలు సమావేశాలు నిర్వహించడం ద్వారా ఎంతో నేర్చుకున్నారని చెప్పారు.

రహదారి సౌకర్యం కల్పించరూ..

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం తాళ్ళపాలెం సంత శివాలయం వద్దనున్న తమ నివాసాలకు రహదారి సౌకర్యం కల్పించాలని అక్కడి స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 2014లో సంభవించిన హుదూద్ తుపాన్ సందర్భంలో తాళ్లపాలెం సంత ప్రాంతంలో నివాసాలు కొట్టుకుపోయాయి. దీంతో హుదూద్ బాధితులకు శివాలయం వద్ద నాటి టిడిపి ప్రభుత్వం స్థలాలు కేటాయించి ఇళ్ల మంజూరు చేసింది. 2016 -2019 మధ్య కాలంలో 8 మందికి గృహాలు నిర్మాణం చేసుకొని నాటి నుండి నివాసముంటున్నారు. ప్రభుత్వం ఇళ్ల అయితే మంజూరు చేసింది గాని, ఆ ఇళ్లకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వారి ఇళ్లకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేదు. తుప్పల్లో నుండి కొండపైన ఉన్న ఇళ్లకు వెళ్లాల్సి ఉంది. తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా వీరి నివాసాలకు సౌకర్యాలు కల్పించలేదు. వీధి లైట్లు కూడా వెలగడం లేదు. చీకటి పడితే బయటకొచ్చే పరిస్థితి లేదు. ఇంటికే పరమితం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ నివాసాలకు రోడ్డు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

కొండ భాగంలో రహదారి సౌకర్యం లేని ఇళ్లు ఇవే...

విషసర్పాలతో భయపడుతున్నాం

కొండపైన ఇళ్లు ఉండడం, రహదారి, వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో పిల్లలతో తీవ్ర భయాందోళన చెందుతున్నాం. ఇంటి కుళాయిలు కూడా వేయలేదు. అధికారులు రోడ్లు, కుళాయిలు వేయాలి. తుప్పలు తొలగించాలి.

-త్రినాధ్, తాళ్ళపాలెం సంత ప్రాంతం

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం తాళ్లపాలెం పంచాయతీ పరిధి బంగారయ్యపేట బిసి కాలనీలో మదిని గోవింద (28) అనే యువకుడు తన ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... తాళ్లపాలెం గ్రామానికి చెందిన మదిని సిరిజాము, రాము దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారునికి వివాహం కాగా, రెండో కుమారుడు గోవింద (28)కు ఇంకా పెళ్లి కాలేదు. తాళ్లపాలెంలో ఉన్న ఇంట్లో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న గోవింద, బంగారయ్యపేట బిసి కాలనీలో వారికి ఉన్న మరో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ ఉంటాడు. సోమవారం తాళ్లపాలెంలోని తన ఇంటి నుండి ఎన్నికల్లో ఓటు వెయడానికి వెళ్లిన గోవింద మళ్లీ రాలేదు. దీంతో తల్లి రాము బుధవారం ఉదయం బంగాయ్యపేట బిసి కాలనీలో ఉన్న ఇంటికి వెళ్లి చూడగా, గోవింద ఇంట్లోని దూలానికి చీరతో ఊరి వేసుకొని వేలాడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులకు తెలియజేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాగుడుకు బానిసైన గోవింద ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు రాము, సిరిజాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కశింకోట హెడ్ కానిస్టేబుల్ అప్పలకొండ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవింద (ఫైల్ ఫొటో)

ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న రైతు

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలోని వడ్డాది, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, మల్లం, ఛైపురం, తురకలపూడి, పెదపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు దుక్కులు దున్నుంచి మినుము, పెసర, బొబ్బర తదితర పప్పు జాతి విత్తనాలు చల్లుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు కొద్ది రోజుల క్రితం చెరకు నాట్లు వేయగా, ఇప్పుడు ఆ చెరుకు తోటల్లో గాబు తీస్తూ మహిళలు బిజీగా వున్నారు.

భారీ వాహనాలకు అడ్డుకట్టేది?

-హెచ్చరికలు బేఖాతరు
-చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిలో భారీ వాహనాలకు అడ్డుకట్ట పడలేదు. ఈ మార్గంలో పెట్టిన హెచ్చరిక బోర్డులను బేఖాతరు చేస్తూ దర్జాగా భారీ వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. అయినా ఏ ఒక్క అధికారీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎస్ఇజెడ్ కంపెనీల వాహనాలు, భారీ వాహనాలతో అధ్వానంగా మారిన అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డులో తరచూ ప్రమాదాలు జరిగేవి. ఈ రోడ్డును పునర్నిర్మాణం చేయాలని సిపిఎం, అఖిలపక్ష, ప్రజాసంఘాలు చేసిన ఐక్య పోరాట ఫలితంగా ఇటీవల రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. రోడ్డు నిర్మాణం జరిగిందే తప్ప ఈ మార్గంలో భారీ వాహనాలను కట్టడి చేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అనకాపల్లి- అచ్యుతాపురం మార్గంలో రోడ్డుకు ఆనుకొని ఇరువైపులా పంట కాలవలు ఉండటంతో 20 టన్నుల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వాహనాలు ప్రయాణిస్తే రోడ్డు బీటలు వారి త్వరగా శిథిలమవుతుందని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. అయినా దానిని ఉల్లంఘించి 60 నుండి 70 టన్నుల సామర్థ్యం గల లోడుతో భారీ వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. అనకాపల్లి బైపాస్ జంక్షన్లో ఆర్ అండ్ బి అధికారుల పెట్టిన హెచ్చరిక బోర్డులు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. వాటిని వాహనదారులు బేఖాతరు చేస్తూ తమ పని తమదేనంటూ భారీ వాహనదారులు దూసుకుపోతున్నారు. దీని వల్ల ఈ రోడ్డు ధ్వంసమవుతుంది. అలాగే మునగపాక, హరిపాలెం గ్రామాలలో బ్రిటిష్ హయాంలో నిర్మించిన పురాతన బ్రిడ్జిలు కూడా శిథిలం కావడంతో వాటి మీదుగా అధిక లోడుతో వెళుతున్న వాహనాల మూలంగా ఆ బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదం కూడా ఉందని స్థానికులు భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి యథేచ్ఛగా తిరుగుతున్న భారీ వాహనాలను అరికట్టకపోతే పోరాడి సాధించుకున్న రోడ్డు మార్గం పూర్వ పరిస్థితి తప్పదని పలువురు ఆందోళన చెందుతున్నారు.

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో అధిక లోడ్‌తో వెళ్తున్న లారీ

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల తీర్మానం

ప్రజాశక్తి- అనకాపల్లి

గత మూడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు సర్పంచులు గైర్హాజరైన అధికారులపై పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అత్యవసర సేవలైన తాగునీరు, విద్యుత్తు వ్యవసాయ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. 32 గ్రామపంచాయతీ కార్యదర్శులకు గాను కేవలం పదిమంది హాజరు కావడం పట్ల ప్రజా సమస్యలపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తక్షణమే గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ ఫిర్యాదు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో వైస్ ఎంపీపీలు రాము, సూర్యకుమారి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

మాట్లాడుతున్న వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు

'వైసిపి గెలుపు ఖాయం'

ప్రజాశక్తి-అనకాపల్లి

13న జరిగిన ఎన్నికల్లో వైసిపి 123 అసెంబ్లీ, 21 పార్లమెంటు స్థానాల్లో విజయ దుందుభి మోగించనున్నదని, మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్డులో వున్న పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో చాలామంది ఓటర్లు తమ ఓటు కోసం సరైన అవగాహన లేక పోలింగ్ స్టేషన్‌ల చుట్టూ తిరిగే వారని, ఈ సారి సచివాలయ సిబ్బంది పుణ్యమా అని ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్‌లు అందాయని, వారి సేవలతో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. తెల్లవారక ముందే తమ ఇంటి వద్దే పింఛన్లు అందుకుంటున్న ప్రతి పింఛనుదారుడు ఉదయం ఆరు గంటలకే పోలింగ్ స్టేషన్‌లకు వచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్మోహన్‌రెడ్డి రుణం తీర్చుకున్నారని చెప్పారు. ముఖ్యంగా తమ పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దితున్న జగన్ మోహన్ రెడ్డి గెలుపు కోసం ప్రతి మహిళ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఆదిపత్యంతో స్థానిక అధికార పార్టీ నాయకుల మధ్య కొంత ఇబ్బందులు వచ్చిన, ప్రజలు అవేమి పట్టించుకోకుండా జగన్‌కే ఓటు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడువాకుల నారాయణరావు, రాపేటి మహాలక్ష్మి నాయుడు, పి.కృష్ణపరమాత్మ, సత్యన్నారాయణ, బుజ్జి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం స్థానిక వైఎమ్‌విఏ హాల్లో సత్కరించారు. 588 మార్కులు సాధించిన కరణం సంజన, 587 మార్కులు సాధించిన వరుణ్ సందేశ్, 586 మార్కులు సాధించిన కె.జయరాజ్‌లను జీవీఎంసీ పట్టణ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విఆర్ రాజేశ్వరి దేవి, అనకాపల్లి జిల్లా వినియోగదారుల ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ అధ్యక్షులు జడ్పిటిసి కోఆప్షన్ సభ్యులు జోసెఫ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు రాబట్టడంలో ఉపాధ్యాయుల పాత్ర, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు వెలగా కాశీపతి, కొంచెం నూకయ్య సెట్టి, విన్నకోట బుచ్చిరాజు, పూ సర్ల నరసింహారావు, వెతకం శెట్టి అప్పారావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

డైమండ్ హిట్స్ అధినేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సౌజన్యంతో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకు మూడవ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి పిసిహెచ్ నాయుడు తెలిపారు. స్థానిక గవరపాలెం రైతు భారతి ఓపెన్ ఎయిర్ థియేటర్లో ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 17వ తేదీన గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ వారి 'నాలోన నీవే', అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారిచే 'అమృత హస్తం' నాటికలు, 18న విజయవాడ మైత్రి కళ నిలయం వారిచే 'బంధం', నెల్లూరు ప్రియదర్శని వారిచే 'నాన్న బంగారు' నాటికలు, 19వ తేదీన విజయవాడ హర్ష క్రియేషన్స్ వారిచే 'మనస్సాక్షి' నాటికలు ప్రదర్శించడం జరుగుతుందని వెల్లడించారు. 1974 - 75 ఎంహెచ్ స్కూల్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కశింకోట

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తుని రైల్వే పోలీసు స్టేషన్ పరిధి యలమంచిలి- నర్సింగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలు ప్రకారం... 35 సంవత్సరాలు గల గుర్తు తెలియని పురుషుడు యలమంచిలి- నర్సింగపల్లి రైల్వే స్టేషన్ల రైలు బండి నుండి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండటాన్ని బుధవారం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని ఊరు, పేరు, ఇతర వివరాలు ఏమీ తెలియరాలేదు. నేరేడు పండు రంగుపైన పచ్చరంగు నిలువు చారుల చేతులు ఉన్న చొక్కా, నలుపు రంగు ఫుల్ ప్యాంటు ధరించాడు. అవి తప్ప మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని తుని గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ మార్చురీలో భద్రపర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ మృతుని వివరాలు తెలిసిన వారు 9494887786, 9490619020 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఓటర్లలో పెరిగిన చైతన్యం

-గతం కంటే అధికంగా పోలింగ్ నమోదు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గంలో ఓటర్లలో చైతన్యం వెల్లి విరిసింది. సమయం దాటినా ఓటర్లు గంటలు తరబడి పోలింగ్ స్టేషన్ల వద్ద క్యూలో నిలబడి ఓటువేసారు. ఎండను సైతం లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 82.41 శాతం పోలింగ్ నమోదయింది. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొత్తం 250744 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 123363, మహిళలు 127379, ఇతరులు 2 మంది ఉన్నారు.కోటవురట్ల మండలంలో 52 పోలింగ్ స్టేషన్లకు గాను పురుషులు 21705, మహిళలు 22754 మొత్తం 44459 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 18475, మహిళలు 19330 మొత్తం 37805 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 85 శాతం పోలింగ్ నమోదయింది. పాయకరావుపేట మండలంలో 90 పోలింగ్ స్టేషన్లకు గాను పురుషులు 39518, మహిళలు 39958 మొత్తం 79476 ఓటర్లు ఉండగా, పురుషులు 31400, మహిళలు 31049 మొత్తం 62449 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 78 శాతం పోలింగ్ నమోదయింది. నక్కపల్లి మండలంలో 75 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 32426, మహిళలు 32863 మొత్తం 65289 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 27665, మహిళలు 27562 మొత్తం 55227 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84 శాతం పోలింగ్ నమోదయింది. ఎస్.రాయవరం మండలంలో 75 పోలింగ్ కేంద్రాలకు గాను పురుషులు 29714, మహిళలు 31804, ఇతరులు 2 మొత్తం 61520 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 24871 ,మహిళలు 26273, ఇతరులు 1, మొత్తం 51145 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83 శాతం పోలింగ్ నమోదయింది. పాయకరావుపేట నియోజకవర్గం లో నాలుగు మండలాల్లో 292 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం పురుషులు 102411, మహిళలు 104214, ఇతరులు 1, మొత్తం 206626 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 82.41 శాతం పోలింగ్ నమోదయింది. పాయకరావుపేట నియోజకవర్గం లో పోలింగ్ అయిన ఓటరు శాతాన్ని ఆర్ఓ గీతాంజలి, ఏఆర్ఓ శ్రీకాంత్ వెల్లడించారు. 2019 ఎన్నికల్లో 81.32శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

దోసలపాడులో అర్ధరాత్రి క్యూలో ఉన్న ఓటర్లు

గంటల తరబడి క్యూలో ..

మండలంలోని గ్రామాల్లో పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు గంటలు తరబడి క్యూలో నిలబడి ఓట్లు వేశారు.నక్కపల్లి, ఉపమాక ,వేదుళ్లపాలెం తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.దోసలపాడులో ఈవీఎంలు మొరాయింపు ,పెద్ద సంఖ్యలో ఒక్కసారిగా ఓటర్లు తరలి రావడం ,తదితర సమస్యలు కారణంగా మంగళవారం తెల్లవారుజాము వరకు పోలింగ్ కొనసాగింది.ఎంత ఆలస్యం అయినప్పటికీ ఓటర్లు ఓటు వేసే వరకు వెనుతిరగలేదు .

గెలుపు పై ఎవరిధీమా వారిది ..

పేటలో గెలుపు పై ఎవరిధీమా వారుకున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమకున్న విజయ అవకాశాలపై లెక్కలు వేసుకుంటున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో పోలింగ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకుని, ఓటర్లు వారిగా తమకున్న అవకాశాలను లెక్కలు వేసుకుంటూ, వారికున్న సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని గెలుపు పై ఎవరి ధీమాలో వారున్నారు.

కోటవురట్ల మండలంలో 85శాతం పోలింగ్

ప్రజాశక్తి కోటవురట్ల:సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మండల వ్యాప్తంగా 85శాతం పోలైనట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో మొత్తం ఓట్ల సంఖ్య 44459 కాగా మహిళలు 21754, పురుషులు 21705 ఉన్నారు. మొత్తం పోలైన ఓట్లు 33805, మండల వ్యాప్తంగా 52 పోలింగ్ కేంద్రాలకుగాను గ్రామాల వారిగా పోలైన ఓట్లు పాములవాక 2027, బికే పల్లి 1472, అన్నవరం 1417, ఎండపల్లి 1496, జల్లూరు 1122, రామచంద్ర పాలెం 1222, బోడపాలెం 1536, నీలిగుంట 946, పీకే పల్లి 1075, ఏఎస్ పేట 801, చిన్నబొడ్డేపల్లి 922, కొడవటిపూడి 2038, వెంకటాపురం 3018, జగ్గంపేట 542, తిమ్మాపురం 548, కైలాసపట్నం 1600, కోటవురట్ల 4535, లింగాపురం 1672, తంగేడు 1618, సుంకాపూర్ 1211, రామన్నపాలెం 824, రాజుపేట 1557, చౌడువాడ 1415, గొట్టువాడ1242, రామచంద్రపురం 1044, పందూరు 1359 చొప్పున పోలినట్లు కార్యాలయ వర్గాలు తెలియజేశాయి.

పోలింగ్ నమోదులో.. పాడేరు, డుంబ్రిగుడ టాప్

ప్రజాశక్తి పాడేరు.:- అల్లూరి జిల్లాలోని పాడేరు అరకు ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల లో మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలను బుధవారం అధికారులు వెల్లడించారు. వీటి వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని జి.మాడుగుల మండలంలో మొత్తం ఓటర్లు 44224 మంది ఉన్నారు. ఈ మండలంలో 28,586 ఓట్లు పోలయ్యాయి. పాడేరు మండలంలో ఓటర్లు 44280 గాను 31, 752 ఓట్లు పోలయ్యాయి. కొయ్యూరు మండలంలో ఓటర్లు 43433 గాను 29,546 ఓట్లు పోలయ్యాయి. జీకే వీధి మండలంలో ఓటర్లు 51,666 మందికి గాను 30,840 ఓట్లు పోలయ్యాయి. చింతపల్లి మండలంలో 64,784 మందికి గాను 38,023 ఓట్లు పోలయ్యాయి. అరకులోయ అసెంబ్లీ నియోజక వర్గంలో 71.12 శాతం పోలింగ్ నమోదయ్యిందని అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఏ పి.ఓ వి. అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలను తెలిపారు నియోజక వర్గం పరిధిలో ఆరు మండలాలలో డుంబ్రిగుడ 48 పోలింగ్ కేంద్రాలలో 38.536 మంది ఓటర్లలో 29,406 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని అత్యధికంగా 76.31 శాతం పోలింగ్ శాతం నమోదయ్యిందన్నారు. పెదబయలు మండలంలో 42,863 మంది ఓటర్లకు 27729 మంది ఓటు వేయగా అత్యల్పంగా 64.69 శాతం నమోదయ్యిందని పేర్కొన్నారు. ముంచంగిపుట్టు మండలంలో 38,486 మంది ఓటర్లలో 26,550 మంది ఓటు వేసారని 68.99 శాతం ఓట్లు పోలయ్యాయని చెప్పారు. హుకుంపేట మండలం 45,380 ఓటర్లలో 32,971 మంది ఓటు వేయగా 72.66 శాతం నమోదయ్యిందని తెలియజేసారు. అరకు లోయ మండలంలో 42,494 మంది ఓటర్లలో 31,916 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా 75.11 శాతం, అనంతగిరి మండలంలో 37,730 మంది ఓటర్లకు 26,016 మంది ఓటు వేసారని 68.95 శాతం నమోదయ్యిందన్నారు. నియోజక వర్గంలో 2,45,469 మంది ఓటర్లలో 1,74,588 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు.

అధికారులకు ఎన్నికల సిబ్బందికి అభినందనలు

సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేసిన అధికారులకు, సిబ్బందికి రిటర్నింగ్ అధికారి అభినందనలు తెలియ జేసారు. ఎన్నికల ప్రక్రియలో నిరంతరం నామినేషన్ల స్వీకరణ నుండి పోలింగ్ నిర్వహణ వరకు ఎన్నికల విజయవంతానికి సహాయ సహకారాలు అందించారని చెప్పారు. ఐటిడిఏ సహాయ ప్రాజెక్ట అధికారి ఎం.వెంకటేశ్వరరావు, అరకువ్యాలీ తహశీల్దారులు సుధాకర్, సోమేశ్వరరావు, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగి పుట్టు తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దారులు, రెవెన్యూ సిబ్బంది, ఐటిడిఏ సిబ్బంది, పోలింగ్ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేసారు.

పాడేరు మండలం టాప్

పాడేరు: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 50 శాతం దాటి నమోదయింది. ఈ సెగ్మెంట్లో పాడేరు మండలమే 71.71శాతం పోలింగ్ నమోదయి టాప్లో నిలిచింది. రెండో స్థానంలో కొయ్యూరు మండలం 68శాతం పోలింగ్ జరిగింది. ఈ సెగ్మెంట్లో అత్యధిక ఓటర్లు చింతపల్లి మండలంలో 64 వేల 784 మంది ఉన్నారు. ఈ మండలంలో 38 వేల 23 మంది ఓటు వేశారు. దీంతో ఇక్కడ 58.70 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది.

అరకు సెగ్మెంట్లో డుంబ్రిగూడ టాప్..

అరకులోయ సెగ్మెంట్లో ఈసారి 72 శాతం పోలింగ్ జరిగి గతం కంటే పోలింగ్ శాతం మెరుగయ్యింది. మూడు మండలాల్లో 70 శాతం మరో మూడు మండలాల్లో 60 శాతం దాటి పోలింగ్ నమోదైంది. ఈ సెగ్మెంట్లో డుంబ్రిగుడ మండలం 76.31శాతం పోలింగ్తో టాప్లో నిలిచింది. రెండో స్థానంలో అరకు మండలం 75.11 శాతం, మూడో స్థానంలో హుకుంపేట మండలం 72.66శాతం నమోదంది.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- కొత్తకోట:రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామం లో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి, శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 98మంది కంటి రోగులు హాజరయ్యారు వీరికి ఆప్తాలమిక్ అసిస్టెంట్ వరహాలు, దేవి పరీక్షలు చేయగా వీరిలో 41 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించినట్లు ఏరియా కో ఆర్డినేటర్ అశ్వనికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి అనితా కుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేదుళ్లపాలెం హైవే జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఒడిస్సా లోని పారాదీప్కు చెందిన గవ్వల తాతయ్య (29) రాజయ్యపేట లో బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి వేదుళ్లపాలెం హైవే జంక్షన్ సమీపంలో నక్కపల్లి నుండి వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వాహనం తాతయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడడంతో, స్థానిక సిహెచ్ సీలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు హెచ్సి శ్రీను తెలిపారు.

ట్రాఫిక్ జామ్తో నిలిచిన వాహనాలు

బ్రిడ్జి వద్ద నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని బయపురెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద బుధవారం ఉదయం 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఒకేసారి ఆర్టీసీ బస్సు, లారీ ఈ బ్రిడ్జి మీదకు వచ్చేయడంతో ఈ రెండు వాహనాలు మధ్యలో చిక్కుకుపోయాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం కలగడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు, పలువురు వాహనదారులు ఈ వాహనాలను నెట్టి వేసి ట్రాఫిక్ను క్లియర్ చేశారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పశువులకు జబ్బ వాపు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని మండల పశు వైద్య అధికారి రాజా శ్రీ రైతులకు సూచించారు. కురిడి, నారింజ వలస, అరకు గ్రామాలలో బుధవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు ముందస్తుగా టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మూగ జీవులకు ఎటువంటి వ్యాధులు ప్రబలినా పశు వైద్య కేంద్రాల్లో, రైతు భరోసా కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు తమ పశువులకు టీకాలను వేయించుకోవాలని ఆమె కోరారు. గ్రామాల్లో మూగజీవులకు ఎటువంటి వ్యాధులు వచ్చినా అందుబాటులో ఏహెచ్ఏలు ఉంటారన్నారు. వారిని సంప్రదిస్తే వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు ఎస్ త్రినాధరావు, ఎస్.జయరాజు, జానకి పాల్గొన్నారు.

రహదారి శిథిలం

-అవస్థలు పడుతున్న వాహనదారులు, పాదచారులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట నుంచి జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, చీమలపాడు పంచాయతీలలో సుమారు 20 గ్రామాలకు ఇంటర్నల్ అప్రోచ్ రహదారిగా ఉపయోగిస్తున్న రహదారిని అభివృద్ధి చేయక పోవడం తో పలువురు వాహన దారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తకోట గాంధీ నగర్ నుంచి గాలి వారి కల్లాలు వరకూ సుమారు రెండున్నర కిలోమీటర్లు దూరం కలిగిన ఈ రహదారి గత మూడేళ్లగా శిథిలావస్థకు చేరుకుంది. కొత్తపట్నం, గంపవానిపాలెం, అంట్లంపాలెం, గ్రామాలతో పాటు చీమలపాడు శివారు కల్యాణపులోవ జలాశయానికి మరో 14 గిరిజన గ్రామాలకు అడ్డదారి గా ఉపయోగించే రహదారి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడుస్తూ ఉండగా రాత్రి వేళల్లో పలు గ్రా మాలకు చెందిన పాదచారులకు రవాణా సౌకర్యం లేక కాలినడకనే గ్రామాలకు చేరుకుంటుంటారు. దొండపూడి చెక్ పోస్టు బియన్ రోడ్డు నుంచి కళ్యాణపులోవ జలాశయం చేరుకోవాలంటే సుమారు 10 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేయాల్సి ఉండగా ఈ అడ్డదారిలో ప్రయాణిస్తే సుమారు మూడు కిలోమీటర్లు దూరం తగ్గుతోంది. అందుకే పలు గ్రామాల ప్రజలు ఈ రహ దారి వెంబడి ప్రయాణం చేస్తుంటారు. ఈ రహదారి పూర్తిగా శిథిలం కావడంతో రాత్రి వేళల్లో వాహన దారులు, పాదచారులు

నానా అవస్థలు పడుతున్నారు. గత ఏడాదిగా ఈ రహదారికు మరమ్మతులు చేపడతా మని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హామీ ఇవ్వడంతో పాటు సుమారు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించారు. నిధులు కేటాయింపు జరిగినప్పటికీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో గత ఆరు నెలలుగా పనులు ప్రారంభం కాలేదు. ఇలోగా ఎన్నికలు షెడ్యూల్ విడుదల కావడంతో రహదారి పనులు మరింత జాప్యం అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ఈ రహదారిపై దృష్టి సారించి పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని సుమారు మూడు పంచాయతీల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆరిలోవ రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి-గొలుగొండ:వందేళ్ల నాటి సమస్య పరిష్కారమైంది. నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు వేయించారు. నర్సీపట్నం కృష్ణదేవిపేట ప్రధాన రహదారి మార్గంలో ఆరిలోవ అటవీ ప్రాంతం ఉంది. దీంతో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. దీంతో ఈ దారిలో ఎక్కడో చోట ప్రమాదాలు జరిగేవి. ఇప్పటి వరకూ ఈ దారిలో 50కి పైగానే మరణాలు జరిగాయి. వందల సంఖ్య క్షతగాత్రులుగా మారారు. రోడ్డు విస్తరణకు అటవీశాఖ నుంచి అభ్యంతరాలు ఉండటంతో ఎవరూ ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. అయితే 2019 ఎన్నికల సమయంలో గొలుగొండ మండల పర్యటనలో ఎమ్మెల్యే గణేష్ ఎన్ని కష్టాలు వచ్చినా సరే రోడ్డు విస్తరణ చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అన్నట్లుగానే ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాది నుంచి ఈ సమస్యపై దృష్టి పెట్టారు.ముందుగా అటవీ, ఆర్అండ్‌బి, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి సలహాలు ఇవ్వాలని కోరగా, అటవీ ప్రాంతంలో రోడ్డు వేయడం చాలా కష్టమని దీనికి అనేక నిబంధనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. దీంతో ఆయన సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముందుగా రోడ్డు విస్తరణకు గొలుగొండ మండలంలో ప్రభుత్వ భూమి కేటాయించాలని అటవీశాఖ తెలపగా 2023లో పాకలపాడు రెవెన్యూ పరిధిలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి అటవీశాఖకు కేటాయించడం జరిగింది. రోడ్డు విస్తరణలో భాగంగా చెట్ల నరికివేత, మొక్కల పెంపకం కోసం మరో రూ.49లక్షలు అటవీశాఖకు బదలాయింపు చేశారు. అంతేకాక రోడ్డు నిర్మాణం కోసం సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రూ.6కోట్లు మంజూరు చేశారు. దీంతో గత ఏడాది చివరిలో రోడ్డు మొదటి దశ పనులు పూర్తి చేశారు. ఇప్పుడు తుది దశకు పనులు పూర్తి రోడ్డును అందుబాటులోకి తీసుకువచ్చారు.

గతంలో ప్రమాదాలు జరిగేవి

ప్రతీ గురు, శుక్రవారం జోగుంపేట ట్రైసైకిల్‌పై వచ్చేవాడివి. ఎక్కడైనా పడిపోతానని భయంతో ఎప్పుడు ఒక మనిషిని తోడు తీసుకువచ్చేవాడిని, కానీ ఈ రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటి నుంచి తాను ఒక్కడినే వస్తున్నానని, రోడ్డు నిర్మాణం పూర్తి చేయించిన ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాన్నారు.

చిన్ని
అడ్డసరం, రోలుగుంట మండలం

మే పుష్పాలు

అల్లూరి పార్కులో ఆకట్టుకున్న మే పుష్పాలు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో మే పుష్పాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ప్రతీ ఏటా మే నెలలో పూసే ఈ పుష్పాలు ఈ పార్కులో ఉండటంతో పార్కు అందాలను మరింతగా ఆకర్షించేలా పువ్వులు దర్శనమిస్తున్నాయి.పర్యాటకులు వీటిని చూసి తన్మయం చెందుతున్నారు.

కార్పెంటర్ ఇళ్లపై దాడులు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేట కార్పెంటర్ ఇళ్లపై ఫారెస్ట్ అధికారులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 15 కలప ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ వెంకటరావు తెలిపారు. బంగారయ్యపేట నుంచి బైక్‌పై మూడు కలప ముక్కలను అక్రమంగా తరలిస్తుండగా తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నామని రేంజర్ తెలిపారు. కలప బైక్ స్వాధీనం వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు రేంజర్ తెలిపారు.

కలపను తనిఖీ చేస్తున్న అధికారులు

పుస్తకాలు చదివిస్తున్న జనార్ధన్

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డి గల్లు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కే జనార్ధన్ కోరారు. బుధవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పలు విజ్ఞాన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, నీతి కథలు బోధించడం, జాతీయ నేతల జీవిత చరిత్ర గురించి వివరించడం జరుగుతుందన్నారు. క్విజ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈనెల 15 నుండి జూన్ 7వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

అజాగ్రత్తగా వెళితే అంతే సంగతులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఇటీవల కురిసిన వర్షాలతో మండలంలోని అరకు సమీపంలో బురద గెడ్డ వంతెనకు ఆనుకుని రోడ్డు రంధ్రం ఏర్పడడంతో ఆ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది అరకు, పాడేరు ప్రధాన మెయిన్ రోడ్డు కావడంతో వాహనాలు నిత్యం రద్దీగా రాకపోకలు రవాణా సాగిస్తుంటాయి. వాహనదారులు ఒకవేళ ఆదమరిచి ఆ గోతులో దిగితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. అంత ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మత్తు పనులు చేసి పూడ్చడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని వాహనదారులు అంటు న్నారు. వాహనదారులు ప్రమాదానికి గురి కాకుండా ముందుగానే అధికారులు మేల్కొని రోడ్డు రంధ్రం మరమ్మతు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై పడిన రంధ్రం

కూటమి నేతలకు ధన్యవాదాలు

-ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి- చింతపల్లి: సమిష్టి కృషి సత్ఫలితాన్ని ఇస్తుందని తాను దృఢంగా నమ్ముతున్నానని టిడిపి పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్, ఎన్డీఏ కూటమి పాడేరు శాసనసభ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి అన్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో టిడిపి చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో చింతపల్లి మండల కమిటీ సభ్యులు పాడేరులో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, తెదేపా జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో పోలింగ్ ఆశించిన రీతిలో కూటమి అభ్యర్థులకు అనుకూలంగా పోల్ నమోదు అయిందన్నారు. ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసిన తెదేపా జనసేన బిజెపి శ్రేణులకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. చింతపల్లి మండల కమిటీతో పాటు కొయ్యూరు మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఉన్నారు.

మాట్లాడుతున్న ఈశ్వరి

వైసిపిదే అధికారం

-పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి:రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలలో మళ్లీ జగనన్న ప్రభుత్వం ఏర్పాటు కానుందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భాగ్యలక్ష్మి దంపతులు మాట్లాడుతూ, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరు వైసిపికి ఓటు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. కూటములుగా ఏకమై వచ్చినా, ఒంటరిగా పోరాడే జగనన్న వెంటే ప్రజలు ఉన్నారని తెలిపారు.